క్లుప్తంగా

గంగనీళ్ల స్నానానికి భీమన్న దేవుడు



గంగనీళ్ల స్నానానికి తీసుకెళ్తుతున్న భక్తులు

ఇచ్చోడ: భీమన్న దేవుడిని గురువారం గంగనీళ్ల స్నానానికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని నవయువ కాలనీలో భీమన్న దేవుడిని గంగనీళ్ల స్నానానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భీమన్న గుట్టవద్ద ఉన్న ఆలయానికి ఉత్సహ విగ్రహాలను తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 3 గంటలకు కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు భీమన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెరమల్ల నారాయణ తెలిపారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతం వద్ద రెండో రోజు గురువారం వైద్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కుంటాల జలపాతం వద్ద వెలిసిన సోమేశ్వరుడి ఆలయాన్ని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్‌ఈఓ పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఎంఎల్‌హెచ్‌పీలు వాణి, నిఖిత, ప్రధానోపాధ్యాయుడు జి.అంబారావ్, భీంరావ్, అశ్విని పాల్గొన్నారు.

అన్నదానం కోసం బియ్యం విరాళం

ఆదిలాబాద్‌టౌన్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం కోసం సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బియ్యం విరాళంగా అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీ అభయాంజనేయ ఆలయంతో పాటు భోరజ్ మండలంలోని గూడ శివాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తలమడుగు మండలం ఝరి ఆలయంలో అన్నప్రసాదానికి రెండు క్వింటాళ్ల బియ్యం అందించారు.

ఆర్థిక సాయం

బజార్‌హత్నూర్: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామం అనంతరపూర్‌లో ఈనెల 24న విద్యుత్ షాక్‌తో కోరెంగ హన్మంతు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఆయన దీన స్థితికి చలించిన గ్రామస్తులు గురువారం రూ.25 వేల నగదును హన్మంతు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాన్కు, మాజీ సర్పంచ్ నగేశ్, హీరాలాల్, భగవంత్‌రావ్, గున్వంత్‌రావ్, మాణిక్‌రావ్, శ్రీనివాస్, గౌతం, నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

తొడసం కైలాస్‌కు సన్మానం



సన్మానిస్తున్న డీఈవో, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్న గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్‌ను జిల్లా విద్యాశాఖాధికారులు సన్మానించారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఈవో చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత తొడసం కైలాస్ దంపతులను శాలువాతో సత్కరించారు. గోండి, కొలామి భాషల పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులకు డిజిటల్ విద్య బోధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు నారాయణ, శ్రీకాంత్ గౌడ్, తుషార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, సూపరింటెండెంట్ మధుసూదన్ పాల్గొన్నారు.

ముగిసిన పోలింగ్

- ప్రశాంతంగా పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఓటేసేందుకు పోటెత్తిన ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఓటేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు. – సాక్షినెట్‌వర్క్



బేల: ఓటు వేసిన పట్టభద్రులు



ఇంద్రవెల్లి: పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా



నేరడిగొండ: సిరాచుక్క చూపిస్తున్న ఓటర్లు



ఉట్నూర్‌రూరల్: ఓటేసిన ఉపాధ్యాయులు



నార్నూర్: పోలీసుల బందోబస్తు

- నేరడిగొండ మండల పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 643 ఉండగా, 476 మంది ఓటు వేశారు. ఉపాధ్యాయ ఓటర్లు 53 ఉండగా 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీడీవో రాజ్‌వీర్, తహసీల్దార్, కలీమ్, డీటీ మహేశ్, ఆర్‌ఐ నాగోరావ్ పర్యవేక్షించారు.
- నార్నూర్‌లో 506 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. 326 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల పోలింగ్ 64.42 నమోదైంది. ఉపాధ్యాయులు మొత్తం 64 మందికి 59 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయుల పోలింగ్ 92.18 శాతం నమోదైంది. గాదిగూడలో పట్టభద్రులు 52 మందికి 41 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌శాతం 78.84 నమోదు కాగా ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడంతో ఆయన ఓటుహక్కును వినియోగించుకున్నారు.
- బేల పోలింగ్ కేంద్రంలో గురువారం 75.19శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 379 మంది ఓటర్లకు 285 మంది పట్టభద్రులు ఓటు వేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 20 మందికి 20 మంది ఉపాధ్యాయులు ఓటు వేసినట్లు తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ రావు తెలిపారు.
- సిరికొండ మండలంలో పట్టభద్రుల, ఉపాధ్యా ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల పోలింగ్ 79 శాతం, ఉపాధ్యాయ పోలింగ్ 90 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.
- ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కాగా.. మండలంలో పట్టభద్రులు 342 మంది ఉండగా.. 263 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 32 మంది ఉపాధ్యాయులకు 31 మంది ఓటు వేశారు.
- ఇచ్చోడ మండల కేంద్రంలో ఉపాధ్యాయ ఓట్లు 58 ఉండగా.. 37 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులు 659 ఉండగా.. ఇందులో 465 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ఓటర్ సరళిని పరిశీలించారు.
- తాంసి మండల కేంద్రంలో 344 పట్టభద్రులకు 258 మంది, 21 ఉపాధ్యాయ ఓటర్లకు 19 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఓటుహక్కు వినియోగించుకున్నాడు. పట్టభద్రుల పోలింగ్ 77.24, ఉపాధ్యాయ పోలింగ్ 90.47 శాతం నమోదైంది.
- బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో 49 ఉపాధ్యాయులకు 48 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 550 పట్టభద్రులకు 371 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 67.45 శాతం ఓటింగ్ పోలైనట్లు పీవోలు ప్రశాంత్, రామారావు తెలిపారు.
- ఉట్నూర్‌రూరల్ మండలంలోని పోలింగ్ సరళిని ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేందర్‌గౌడ్ పరిశీలించారు. ఉట్నూర్‌లో మొత్తం పట్టభద్రులు పోలింగ్ 69.83 శాతం, టీచర్ల ఓటర్లు 92.88 శాతం పోల్ అయినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరిశీలించారు.
- తలమడుగు మండలంలో పట్టభద్రుల 614 ఉండగా 478 మంది ఓటు వేశారు. 78 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయులు 25 మంది ఉండగా 23 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 98 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కేంద్రాలను తహసీల్దార్ రాజ్‌మోహన్ పరిశీలించారు.
- ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం జిల్లా కేంద్రంలో పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ జరుగుతున్న విధానం గురించి పార్టీ నాయకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.



ఇచ్చోడలో..



సిరికొండ: ఎన్నికల సామగ్రి తరలిస్తున్న సిబ్బంది



తాంసి: ఓటుహక్కు వినియోగించుకున్న దంపతులు



ఉట్నూర్‌రూరల్: పరిశీలిస్తున్న ఎస్పీగౌస్ ఆలం

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: ఓటింగ్ సరళిని గమనిస్తే పట్టభద్రుల నియోజకవర్గంలో తప్పకుండా తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయం సాధిస్తారని కాంగ్రెస్ ఆదిలా బాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నా రు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. పార్టీ శ్రేణులతో మాట్లాడి పోలింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఉత్సాహంతో పట్ట భద్రులు కదిలిచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. ఆయన వెంట పట్టణ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. గురువారం పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టభద్రులంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని అన్నారు.

ఆలయాల్లో రామన్న పూజలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జైనథ్, భోరజ్ మండలాల్లోని పలు శివాలయాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న దర్శించుకున్నారు. భోరజ్ మండలంలోని గిమ్మ గ్రామంలో గల ఉత్తర వాహిని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మార్శెట్టి గోవర్ధన్, లింగారెడ్డి, నారాయణ, దమ్మాపాల్, బట్టు సతీష్, నాయకులు ఉన్నారు.

బేల: మండలంలోని బాది గ్రామ శివారులోని నందీశ్వర ఆలయంలో గురువారం జోగు రామన్న పూజలు చేశారు. ఆలయాల నిర్మాణాలు, అభివృద్ధి నిధులు ఖర్చు చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, ప్రమోద్ రెడ్డి, జక్కుల మధుకర్, సతీష్ పవార్, కోడే విపిన్, సంతోష్ పాల్గొన్నారు.

ముగిసిన లింబాద్రిస్వామి జాతర



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

- భారీగా హాజరైన భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న యువతులు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో వెలిసిన స్వయంభూ లింబాద్రి నరసింహ స్వామి ఆలయ ఆవరణలో మూడు రోజులుగా కొనసాగుతున్న జాతర గురువారం ముగిసింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రతీ ఏటా మూడు రోజుల పాటు జాతర నిర్వహించారు. ఆలయంలో యజ్ఞం, స్వామి కల్యాణం, భజన, సత్యనారాయణ వ్రతం చేపట్టారు. అనంతరం డప్పుచప్పుల మధ్య గ్రామంలో ఊరేగింపుగా రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్ని అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామపెద్దలు పొతన్న, శ్రీనివాస్, లింగన్న, నారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ..

మండలంలోని బండల్‌నాగాపూర్ రామాలయంతో పాటు తాంసి మండల కేంద్రంలోని నాగేశ్వరలయంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఎంపీని శాలువాతో సత్కరించారు. ఎంపీ వెంట మాజీ జెడ్పీటీసీ రాజు, సంతోశ్ రెడ్డి, నారాయణ, సదానంద్, చంద్ర కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. శివరాత్రి పర్వదిన పురస్కరించుకొని భక్తులు బుధవారం ఉపవాస దీక్ష చేపట్టి గురువారం శివాలయాల్లో విరమించారు. అదే విధంగా తలమడుగు మండలం ఝరి ఆలయంలో అన్నదానం కార్యక్రమానికి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి ఆలయల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు 2 క్వింటాళ్ల బియ్యం, నందిగామంలో శివాలయానికి వచ్చే భక్తులకోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

నార్నూర్: మండలంలోని చోర్గావ్ గ్రామంలోని శ్రీమూర్తి రాములు శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సరిహద్దు నుంచి నిర్వహించిన శోభాయాత్రలో జ్వాలాముఖి పీఠాధిపతి రామ్ సింగ్ మహరాజ్, శ్రీమూర్తి రాములు శివాలయం పీఠాధిపతి శ్రీరామ్ మహరాజ్ పాల్గొన్నారు. కలశంతో మహిళలు శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతులు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చెర్మన్ ఆడే సురేశ్, మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్, జాదవ్ శ్రీరాం, ప్రవీణ్‌నాయక్, నారాయణ, రెడ్డి నాయక్ జాదవ్, రమేశ్ నాయక్, పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యశాఖ అధికారి ప్రణీత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వివిధ ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట సెక్టోరల్ అధికారి జె.నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిల్లి కిషన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం

నేరడిగొండ: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సాబ్లే సంతోష్ సింగ్‌ను అభినందించి మిఠాయి తినిపించారు. ప్రతిఒక్కరు ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను పార్టీ నాయకులను శాలువతో సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

నేరడిగొండ: మండల వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ప్రధాన శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ మహోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. రాజరాజేశ్వర శివాలయంలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కుంటాల జలపాతం వద్ద కొలువైన సోమేశ్వరుడిని భక్తులు దర్శించుకున్నారు.

సిరికొండ: శివరాత్రి పర్వదినం రెండో రోజు కూడా మండలంలోని శివాలయాల్లో శివ నామస్మరణతో మండల కేంద్రంలోని శివాలయం, కోండాపూర్‌లోని పురాతన ఆలయం, సుంకిడి ఆలయాలు మార్మోగాయి. భక్తులు ప్రత్యేక పూజలు చేసి, ఉపవాస దీక్షలు విరమించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

'గ్రామాలను అభివృద్ధి చేస్తా'

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని హర్కాయి, బీమ్లానాయక్‌తండాలో పర్యటించారు. ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేదని, అటవీ ప్రాంతం గుండా గ్రామాలకు రావడం ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో బీటీరోడ్డు పనులు ప్రారంభించి గ్రామస్తుల దారి కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ నీరు ప్రతీరోజు వచ్చే విధంగా చేస్తానన్నారు. నాయకులు ఆనందరావ్, నిస్తే కైలాస్, సోమ రాంరెడ్డి, గంగారెడ్డి, సాయన్న, ప్రీతంరెడ్డి, సజన్, దీసీ రమణ, ప్రశాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అన్నదానం

బోథ్: మండలంలో గురువారం శ్రీభక్త మార్కండేయ ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఉపవాసం చేపట్టిన భక్తులు గురువారం ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సొనాలలో భక్తులు బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భజన కార్యక్రమాలు చేపట్టారు.

త్వరలో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణం

తలమడుగు: ఇల్లు లేని నిరుపేదల కోసం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు నమూనాను పనులు త్వరలో ప్రారంభించడం జరుగుతుందని గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి బసవేశ్వర రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షలు, మిగతా వారికి 5 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి

– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామ సమీపంలోని పోచమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం పోచమ్మ ఆలయాన్ని సందర్శించి గ్రామస్తులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఆలయంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆలయంలో తాగు నీరు, బోర్‌బావి, రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తానన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తలమడుగు: వేసవిలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలో జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఓటింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం ఆదిలాబాద్ నుంచి తలమడుగు, ఖోడద్, గ్రామం నుంచి మండల కేంద్రం అటవీశాఖ అధికారులు మొక్కలు నాటుతుండగా పరిశీలించారు. కార్యక్రమంలో స్వామి, రాజు, చంద్రకాంత్, ప్రభాకర్, నక్క ధనుంజయ్, దాతాజీ కిరణ్, దేవన్న, ప్రేమేందర్ రెడ్డి పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899